క్లుప్తంగా

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి



రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయుడుపేట నాయకులు

నాయుడుపేట టౌన్ : రైల్వే సమస్యలు పరిష్కరించాలని నాయుడుపేట సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మీజూరు మస్తానయ్య, సెక్రటరీ పేర్నాటి జోసెఫ్ కోరారు. వారు శుక్రవారం మాజీ ఎంపీ వరప్రసాద్‌తో కలిసి చెన్నైలోని సౌత్ రైల్వే జోనల్ మేనేజర్ ఆర్ఎన్‌సిన్హా, డీఆర్ఎం విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కరోనా సమయంలో నిలిపేసిన సికింద్రాబాద్ నుంచి చెన్నై వెళ్లే హైదరాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నాయుడుపేటలో నిలపాలని కోరారు. చెన్నై నుంచి సూళ్లూరుపేటకు నడుస్తున్న ఈఎంయూ రైలును నాయుడుపేట వరకు పొడిగించాలన్నారు.

పేదలకు ఆర్థిక సాయం



పేదలకు నగదు అందిస్తున్న నిహాల్‌మనోహర్

కోట: కోటలోని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తన తండ్రి మనోహర్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా 15 మంది పేదలకు పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దుస్తులు, నగదును తన కుమారుడు నిహాల్ మనోహర్ చేతుల మీదుగా అందజేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



శ్రావణిని అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యరమల శ్రావణికి చెన్నైలోని అన్నా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె ఇన్వెస్టిగేషన్ ఆన్ ది క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ రేర్ ఎర్త్ మెటల్ సీరియం ఆక్సైడ్ డోప్డ్ జిర్కోనియా టఫ్ అండ్ అల్యూమినా సిరామిక్ కాంపొజిట్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆమెను శుక్రవారం కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలువాయి(సైదాపురం): రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేసిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కలువాయి ఏవో ప్రతాప్ తెలిపారు. ఆయన శుక్రవారం కలువాయిలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో కోత దశలో ఉన్న వరి పంట, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రెండు మూడు రోజులు వరి కోతలు నిలుపుదల చేయాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్

ఓజిలి: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన బిల్లు పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఓజిలిలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో పవన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆరుమూళ్ల వరప్రసాద్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రవీంద్రరాజు, వరప్రసాద్, కోకొళ్ల శేషయ్య, గోపాల్, జగదీష్, అనీల్ పాల్గొన్నారు.

పంటల సాగులో మెళకువలు పాటించాలి

వెంకటగిరి రూరల్ : రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు తెలిపారు. పెరియవరం సమీపంలోని కేవీకేలో శుక్రవారం 8వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేవీకేలో ఇప్పటి వరకు రైతులకు అందించిన సేవలపై అవగాహన కల్పించారు. ఏడీఏ నాగార్జున సాగర్, చీసీ, నిమ్మ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్యామ్ సుందర్‌రామిరెడ్డి, పశు సంవర్ధకశాఖ ఏడీఏ స్వామిబాబు, శాస్త్రవేత్తలు లక్ష్మిశ్రీ, ఆనంద్‌రెడ్డి, విజయశ్రీ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి విద్య. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు రాణించాలంటే నాణ్యమైన విద్య అందించాలి. ఇందుకోసం తమ బిడ్డలను మంచి పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. వెంకటగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన ఏపీ మోడల్ స్కూల్ పేద పిల్లలకు వరంలా మారింది. ఇక్కడ విద్యతోపాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. సామాజిక స్పృహ, దేశభక్తిపై అవగాహన కలిఏస్తున్నారు. ఈ పాఠశాల పిల్లలు కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- మోడల్ స్కూల్‌లో సృజనాత్మక విద్య
- క్రీడలు, ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ
- ప్రతి ఏటా వంద శాతం ఉత్తీర్ణత
- పాఠశాలలో అడ్మిషన్ కోసం పెరుగుతున్న పోటీ

వెంకటగిరి రూరల్ : పేద పిల్లలకు మాతృభాషతో పాటు ఆంగ్ల మాధ్యమంలోనూ విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వెంకటగిరి పట్టణంలో 2013లో ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)ను ప్రారంభించారు. 6, 7, 8 తరగతుల్లో 240 మంది విద్యార్థులు చేరారు. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 500 మంది (ఒక్కో తరగతిలో 100 మంది) ఉన్నారు. 2016లో ప్రారంభమైన ఇంటర్‌లో 180 మంది చదువుతున్నారు. ఇక్కడ ఏటా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. గతంలో జరిగిన మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా 8వ తరగతి విద్యార్థులు 50 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.

పెరుగుతున్న పోటీ..

ఏపీ మోడల్ స్కూల్‌లో ఏటా ఉత్తమ ఫలితాలు సాధించడం, క్రీడలు, ఎన్‌సీసీతోపాటు సామాజిక కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, క్రమశిక్షణ నేర్పిస్తున్నారు. దీంతో ఈ పాఠశాలలో పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ క్రమంలో పోటీ పెరుగుతోంది. 6వ తరగతిలో 100 సీట్లు ఉండగా 350లకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు ఉపాధ్యాయులు తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల్లోనూ శిక్షణ



పదో తరగతి వరకు ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను ప్రభుత్వం ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసింది. ఇంటర్‌లో రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న పిల్లలు అక్కడే ఇంటర్ కూడా చదువుకుంటున్నారు. వారికి కంప్యూటర్ కోర్సుల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తద్వారా ఇంటర్ పూర్తయి ఉన్నత విద్య చదివే వారికి ఉపయోగపడుతోంది.



వెంకటగిరిలో ఏపీ మోడల్ స్కూల్

మోడల్ స్కూల్‌లో ఫలితాలు

2021-22లో	96 శాతం
2022-23లో	99 శాతం
2023-24లో	98.6 శాతం

ఇంటర్‌లో..

2021-22లో	89 శాతం
2022-23లో	94 శాతం
2023-24లో	96 శాతం



దేశభక్తి పెంపొందించేందుకు విద్యార్థులకు నేవీపై ఇస్తున్న శిక్షణ



పాఠశాలలో విద్య బాగుంది

ఇక్కడ విద్యాబోధన బాగుంది. కంప్యూటర్ కోర్సులు కూడా నేర్పిస్తున్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. నేను ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– మునిలాస్య, పదవ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, వెంకటగిరి



అదృష్టంగా భావిస్తున్నా

ఈ పాఠశాలలో చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యా బోధన అందిస్తున్నారు. ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. నేను క్రికెట్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– సుశాంత్,9వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, వెంకటగిరి



నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రాజెక్టు వర్క్‌లు చేయిస్తున్నాం. కంప్యూటర్‌తోపాటు ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులు నేర్పిస్తున్నాం. దీంతో పిల్లలు ప్రతి ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

– తులసిజ్యోతి, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్‌స్కూల్, వెంకటగిరి

నేడు మండల సర్వసభ్య సమావేశం

దక్కిలి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గుణ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

అసత్య ప్రచారం తగదు

గూడూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చినట్టు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం తగదని ఆ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్ హితవుపలికారు. ఆయన శుక్రవారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముస్లింలకు ద్రోహం చేసేలా ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లును వైఎస్సార్ సీపీ మొదటి నుంచి వ్యతిరేకిస్తోందన్నారు. కొంతమంది పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నట్టు దుయ్యబట్టారు. అసత్య ప్రచారం మానుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తే కఠిన చర్యలు

దక్కిలి: మండలంలో ఈ నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా అశ్లీల, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీరామ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పాట కచేరీలు, డైమండ్ డబ్బా వంటి కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

సరైన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందుల విక్రయం



మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ ప్రశాంతి

సూళ్లూరుపేట : సరైన ప్రిస్క్రిప్షన్ వుంటేనే ఎన్ఆర్ఎక్స్, హెచ్-1, యాంటీ బయాటిక్స్ డ్రగ్స్‌ను మెడికల్ షాపుల్లో విక్రయించాలని శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ ప్రశాంతి ఆదేశించారు. ఆమె శుక్రవారం స్థానిక రోటరీ హాలులో సూళ్లూరుపేట, తడ మండలాల్లోని మెడికల్ షాపుల లైసెన్స్ దారులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చాలా మంది మెడికల్ షాపుల వారు ప్రిస్క్రిప్షన్ లేకుండా నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిపారు. ఇకమీదట అలా ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్ఆర్ఎక్స్, హెచ్-1, యాంటీ బయాటిక్స్ డ్రగ్స్‌కు షాపులో ప్రత్యేకంగా ఒక సెల్ఫ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసే మందులు, విక్రయించే మందుల బిల్లులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. తనిఖీలకు వచ్చినప్పుడు రికార్డులు లేకుంటే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మెడికల్ షాపుల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెన్నకేశవరావు, అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఉపా ధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి కుమారస్వామి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, కోశాధికారి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ



రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

వెంకటగిరి రూరల్ : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆయన శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌తో కలిసి వెంకటగిరి రూరల్ మండలం యాతలూరు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గడిచిన 8 నెలల్లో రాష్ట్రంలో 7 వేల మంది రైతుల నుంచి 74 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి రూ.154 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. తిరుపతి జిల్లాలో 134 రైతు సేవా కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వరిలో 17 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, డీఎస్‌వో లక్ష్మి, సివిల్ సప్లయీస్ డీఎం సుమతి, తహసీల్దార్ రాంబాబు పాల్గొన్నారు.

కండలేరులో 48.083 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 48.083 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

చిట్టమూరు : అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని ఉపాధ్యాయులు కొనియాడారు. ఆరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలకు జగ్జీవన్‌రామ్ చిత్ర పటాన్ని మహాజన టీచర్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి జడ చలపతి బహూకరించారు. హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పుష్పలత, అశోక్, చలపతి, మీరయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

గూడూరు రూరల్ : ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు శాస్త్ర సాంకేతికతను పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలువురికి షీల్డులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తమిళనాడు మంత్రి రాజకన్నియప్పన్, ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ

దక్కిలి : పంటలపై కషాయాలు పిచికారీ చేసి చీడపీడలను నివారించవచ్చని ఏవో భారతి తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం వీవోఏలు, సీసీలు, పొదుపు సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు పెట్టుబడి తగ్గుతుందన్నారు. నాణ్యమైన దిగుబడి వస్తుందని వివరించారు. భూమి సారవంతమవుతుందని చెప్పారు. సూక్ష్మ జీవులు వృద్ధి చెంది పంటలకు పోషకాలు బాగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం జమునారాణి, ఎన్ఎఫ్ఏ స్వామి కొండయ్య, సుహర్లత పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు గుదిబండ

చిల్లకూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు గుదిబండగా మారుతుందని సీపీఎం నాయకులు దుయ్యబట్టారు. వారు శుక్రవారం వక్ఫ్ బిల్లుపై ముస్లింలకు అవగాహన కల్పించారు. బిల్లు వల్ల ముస్లింలు ఎలా నష్టపోతారన్న వివరాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మైనారిటీ సంస్థలకు సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసి వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో టి.వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, జోగి శివకుమార్, పామంజి మణి, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ

కలువాయి(సైదాపురం) : మండల కేంద్రమైన కలువాయి పీహెచ్‌సీలో శుక్రవారం పైలేరియా వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించారు. పైలేరియా నివారణ జిల్లా అధికారిణి హుస్సేనమ్మ మాట్లాడుతూ పైలేరియా వ్యాధిలక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఎం విజయలక్ష్మి, సీహెచ్‌వో జయశీల, సిబ్బంది శ్రీనివాసులు, రఘురామయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో తాగునీటి సమస్య

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు ఆర్టీసీ డిపోలో నాలుగు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో డిపోలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు అల్లాడుతున్నారు. వారు ప్రతి రోజూ బస్సు తీసుకుని పక్కనే ఉన్న సిద్ధిగుంటపాళెం గ్రామానికి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. స్వర్ణముఖి నదీ తీరం నుంచి తీర గ్రామాలకు వెళ్లే మంచినీటి సరఫరా పైపులైను నుంచి డిపోకు కనెక్షన్ వెళుతుంది. దాని ద్వారా డిపోలోని మినరల్ వాటర్ ప్లాంటుకు నీరు వెళుతుంది. మంచినీటి పథకం సరఫరా పైపు లైన్లు మరమ్మతులకు గురికావడంతో నాలుగు రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. అలాగే డిపో పక్కనే ఉన్న జనార్ధన్ రెడ్డి కాలనీ వాసులకు సైతం తాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత



నేతలతో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : అరాచకాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేక పెరిగిందని, జగనన్న లాంటి గొప్ప సీఎంని పోగొట్టుకుని తప్పు చేశామని బాధపడుతున్నారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని తన నివాసంలో నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జమిలీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని ప్రజలు పరితపిస్తున్నారని వివరించారు. కూటమికి బలం లేకపోయినా కుట్రలు చేస్తోందని, ఈ నెల 9న మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ సీపీ చైర్మన్ నక్కా భానుప్రియ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న ఆశయ సాధనలో భాగంగా కౌన్సిలర్లు అందరూ తమ వెంటే ఉన్నారని తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, నక్కా దుర్గాప్రసాద్, బాలాయపల్లి, డక్కిలి మండలాల కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులు రెడ్డి, యోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

అవమానంపై జెడ్పీ చైర్మన్‌కు ఎంపీటీసీ ఫిర్యాదు



జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ శ్రీదేవి

వెంకటగిరి రూరల్ : మండల సర్వసభ్య సమావేశంలో తనకు జరిగిన అవమానంపై పారవోలు ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో కోటేశ్వరరావు కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తనను సమావేశంలో అవమానించారని ఆరోపించా రు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సదారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

దొరవారిసత్రం : బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని మినమనముడి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లి చేస్తే రక్త హీనత, బుద్ధి మాంద్యం తదితర సమస్యలతో పిల్లలు పుడతారని తెలిపారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నాజగరాజు, హెచ్ఎం కృష్ణయ్య, అంగన్‌వాడీ వర్కర్ వెంకటమ్మ, పోలమ్మ, వైద్య సిబ్బంది రమేష్, భోగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నవ ధాన్యాలు సాగు చేయాలి



నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దక్కిలి : రైతులు నవధాన్యాలు సాగు చేయాలని, తద్వారా భూమిలో సేంద్రియ కర్బన పదార్థం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ వెంకటగిరి డివిజన్ ఇన్‌చార్జి స్వామి కొండయ్య తెలిపారు. ఆయన శుక్రవారం వెలికల్లు యూనిట్‌లోని కుప్పాయిపాళెం రైతులకు నవ ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగుతో భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా పంటలకు పోషక పదార్థాలు అందుతాయని, దిగుబడి బాగా వస్తుందన్నారు. ఎకరాలో 20 రకాల విత్తనాలను 12 కేజీల నుంచి 20 కేజీల వరకు చల్లి పూతదశలో భూమిలో కలియదున్నాలని తెలిపారు. తద్వారా మొక్కలకు 18 నుంచి 40 రకాల పోషకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏవో విజయభారతి, ఏపీఎం జమునారాణి, ప్రకృతి వ్యవసాయ ఎంటీ సుహర్లత, డీఎంటీ వేమ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమీర్‌షావలీ దర్గా ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొస్తున్న నిర్వాహకులు



వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ





గంధానికి ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు, నాయకులు, ప్రార్థనలో పాల్గొన్న నాయకులు



సినీ గీతాలాపన

నాయుడుపేట టౌన్: హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసు వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఉత్సవాలను ప్రారంభించారు. రాపూరు నుంచి వచ్చిన ముజావర్లు శుక్రవారం తెల్లవారుజామున దొర్నాదుల చెంచుకృష్ణయ్య ఇంటి వద్ద గంధం తీసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకెళ్లారు. భక్తులకు పంచి పెట్టారు. సినీ కళాకారులు, బుల్లితెర నటులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కనమర్లపూడి సుబ్రమణి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణా రెడ్డి, చదలవాడ కుమార్, షేక్ రఫీ, శిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, షేక్ రహంతుల్లా, పాపాడి చంద్రారెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, డాక్టర్ రంగినేని కృష్ణయ్య పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

హజరత్ అమీర్‌షావలీ దర్గా గంధోత్సవానికి వచ్చిన భక్తులకు వైఎస్సార్ సీపీ సూళ్లూరుపేట నియోజవర్గ మహిళ విభాగం కన్వీనర్ ఈదా రత్నశ్రీ రామకృష్ణాపురం వీధిలో అన్నదానం చేశారు. మౌనిక మదర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున తన వంతు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, లాస్య, హారతి రెడ్డి, సుదర్శన్, అరుణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న రత్నశ్రీ